తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం – 28 – నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 174 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



డీలిమిటేషన్‌పై కేంద్రం

కీలక సవరణలు

- అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య 50 శాతం పెంపు
- 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తి కొనసాగింపు
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు కొత్త ప్రతిపాదనలు
- నవంబర్ 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు)

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, డీలిమిటేషన్ తర్వాత ఏ రాష్ట్రానికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతమున్న పార్లమెంటరీ ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గకుండా రాజ్యాంగ సవరణ బిల్లులో మార్పులు ప్రతిపాదించింది. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను ప్రస్తుత సంఖ్యతో పోలిస్తే 50 శాతం పెంచి, రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 2051 వరకు కొనసాగించే ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సేవాతీర్థ్‌లో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగింది.

కొత్త ప్రతిపాదన ప్రకారం ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచనున్నారు. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు యథాతథంగా కొనసాగించేలా నిబంధనలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

మిగతా 2 లో..

మహిళలకు 33% రిజర్వేషన్లు ఖాయం

- మహిళా కోటాపై అమిత్ షా కీలక ప్రకటన
- రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి విమర్శలు
- యూసీసీ అమలుకు బీజేపీ ప్రభుత్వాల సిద్ధత



న్యూఢిల్లీ, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):

పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కానీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కానీ మహిళా రిజర్వేషన్ల అమలు ప్రక్రియను అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. దేశంలోని మహిళలకు తప్పకుండా 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈ లక్ష్య సాధనకు పూర్తిగా కట్టుబడి ఉందని వెల్లడించారు. ఢిల్లీలో నిర్వహించిన 'సంవిధాన్ గౌరవ్ దివస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ విలువలు, దేశ రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. గత ఏప్రిల్‌లో 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి, మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయాలనే ఉద్దేశంతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తుచేశారు. అయితే ఈ బిల్లుకు విపక్షాలు అడ్డంకులు సృష్టించాయని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించే ప్రయత్నాలను అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ వైఖరిని బయటపెట్టుకున్నాయని ఆరోపించారు. నవంబర్ 30 నుంచి పార్లమెంట్ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అంశంపై అమిత్ షా చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళలకు హక్కులు కల్పించే విషయంలో తమ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయంతో ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ప్రదర్శించినంత మాత్రాన దానిని గౌరవించినట్లు కాదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అమిత్ షా

మిగతా 2 లో..



మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి..

లక్ష్యమే వ్యసనంగా మారాలి

యువతకు మెగాస్టార్ చిరంజీవి పిలుపు

నషా ముక్త్ భారత్ పాదయాత్ర ముగింపు వేడుకల్లో సందేశం

హైదరాబాద్, నవంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు):

యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని సమష్టిగా ఎదుర్కోవాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. మత్తుపదార్థాలకు బానిసలయ్యే బదులు తమ జీవిత లక్ష్యాన్నే ఒక వ్యసనంగా మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర ముగింపు వేడుకలకు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు యువత జీవితాలను మాత్రమే కాకుండా వారి కుటుంబాలను సైతం తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు స్నేహం పేరుతో తెలియకుండానే యువతను వ్యసనాల వైపు మళ్లించే ప్రయత్నం చేస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును నిర్మించుకునే దిశగా అడుగులు వేయాలని అన్నారు. స్నేహితుల్లో ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసలైతే వారిని ద్వేషించకుండా, స్నేహభావంతో దగ్గర తీసుకోవాలని చిరంజీవి సూచించారు. మంచి మాటలు, ఆప్యాయతతో వారిలో మార్పు తీసుకొచ్చి వ్యసనాల నుంచి బయటపడేలా ప్రయత్నించాలని కోరారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మత్తుపదార్థాల నిర్మూలన ఒక్క ప్రభుత్వంతోనే సాధ్యమయ్యే పని కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామాజిక సంస్థలు, ప్రజలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన నషా ముక్త్ భారత్ పాదయాత్ర యువతలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నమని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చిరంజీవి తెలిపారు. యువత తమ శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని మెగాస్టార్ పిలుపునిచ్చారు.



విద్యుత్ రంగానికి కేంద్ర సహకారం కోరిన భట్టి విక్రమార్క

- *రాష్ట్ర విద్యుత్ అవసరాలపై కేంద్రానికి పలు ప్రతిపాదనలు*
- *రూ.25,096 కోట్ల ఆర్‌డీఎస్ఎస్ నిధుల ఆమోదానికి విజ్ఞప్తి*
- *పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు మద్దతు*
- *2030 వరకు పునరుత్పాదక విద్యుత్ ప్రసార ఛార్జీల మినహాయింపు కోరిన రాష్ట్రం*

న్యూఢిల్లీ, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్తు విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ రంగానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, నిధుల అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం,

మిగతా 2 లో..



మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

- *ఫ్లాట్‌లో విగతజీవిగా కనిపించిన సింధూజ*
- *జగిత్యాల జిల్లాకు చెందిన 36 ఏళ్ల మహిళ*
- *నాలుగు నెలలుగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు సూసైడ్ నోట్‌లో ప్రస్తావన*
- *కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు*

2 లో..



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

డీలిమిటేషన్‌పై కేంద్రం కీలక సవరణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ ఎన్నికైన సభ్యుల సంఖ్య ఈ పెంపుతో సుమారు 816కు చేరే అవకాశం ఉంది. రాజ్యాంగంలో గరిష్ఠ పరిమితిని 850 స్థానాలుగా ప్రతిపాదిస్తున్నారు. ఈ మార్పులతో జనాభా పెరుగుదల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగినా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య వాటా తగ్గకుండా చూడాలన్నది కేంద్రం ఉద్దేశంగా తెలుస్తోంది.

ఈ బిల్లుకు పార్లమెంటులో మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మద్దతు పొందలేకపోవడంతో ఆమోదం పొందలేదు. ఈ నేపథ్యంలో తాజా ప్రతిపాదనల్లో అన్ని రాష్ట్రాల సీట్లను ఒకే నిష్పత్తిలో పెంచే అంశాన్ని చేర్చినట్లు వార్తలు వెలువడ్డాయి. డీఎంకేకు చెందిన 22 మంది, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం)కు చెందిన ఎనిమిది మంది ఎంపీల మద్దతు ఈ బిల్లు ఆమోద ప్రక్రియలో ప్రాధాన్యం సంతరించుకోనుంది. అయితే బిల్లు ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలం సభలో హాజరై ఓటు వేసే సభ్యుల సంఖ్యతో పాటు రాజ్యాంగంలోని ప్రత్యేక మెజారిటీ నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

ఈ నెల 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. నవంబర్ 30న లోక్‌సభ సమావేశం కాగా, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశం కానుంది. డిసెంబర్ 3 వరకు సభా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌లను కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ సమావేశాల్లో కీలకమైన బిల్లులు, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరగనున్నట్లు తెలిపారు. ప్రత్యేక సమావేశాల్లో సభ్యులందరూ సభా కార్యకలాపాల్లో నిర్మాణాత్మకంగా పాల్గొనాలని రిజిజు విజ్ఞప్తి చేశారు. ప్రపంచం భారత పార్లమెంటరీ వ్యవస్థను గమనిస్తోందని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా సభా సమావేశాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం అందరి సమష్టి బాధ్యతని అన్నారు. సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చని, అయితే సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించే వ్యాఖ్యలు, చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలు ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశముండటంతో కేంద్రం, విపక్షాల మధ్య చర్చలు కీలకం కానున్నాయి.

మహిళలకు 33% రిజర్వేషన్లు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. రాజ్యాంగం పట్ల గౌరవం అనేది మాటల్లో కాకుండా వ్యక్తుల ప్రవర్తనలో, రాజకీయ వ్యవహారశైలిలో కనిపించాలని అన్నారు. న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శలు చేస్తూ వాటి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆరోపించారు. గతంలో దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి సుమారు 18 నెలల పాటు రాజ్యాంగ హక్కులను నిర్బంధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే ముందు గతంలో ఆ పార్టీ వ్యవహరించిన తీరును గుర్తుచేసుకోవాలని సూచించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటిలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేసి తీరుతామని అమిత్ షా ప్రకటించారు. భారత రాజ్యాంగ రూపకర్తలు సైతం నిర్దేశక సూత్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని చేర్చారని గుర్తుచేశారు. మతం, కులం, వర్గంతో సంబంధం లేకుండా దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన చట్టం వర్తింపజేయడం తమ లక్ష్యమని వివరించారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, పార్సీలతో సహా అన్ని మతాల ప్రజలకు సమాన న్యాయ సూత్రాలు వర్తించే విధంగా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ విషయంలో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ సమగ్రత, భద్రతను బలోపేతం చేసేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామని అమిత్ షా వివరించారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దు, వామపక్ష తీవ్రవాదాన్ని నియంత్రించేందుకు చేపట్టిన చర్యలు, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి స్థాపన దిశగా సాధించిన పురోగతిని ప్రస్తావించారు. ఈశాన్య ప్రాంతాల్లో సుమారు 11 వేల మంది సాయుధులు ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవడం దేశ ఐక్యతకు బలాన్నిచ్చిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది పేదలకు ప్రయోజనాలు అందించామని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, ఉమ్మడి పౌరస్మృతి, జాతీయ భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి, రాజ్యాంగ లక్ష్యాల సాధనకు దోహదపడతాయని అమిత్ షా వెల్లడించారు.

బీసీలకు చట్టసభల్లో 27 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి: ఈటల

- ఇందిరా పార్క్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంపీ డిమాండ్
- అసెంబ్లీ, మండలి, పార్లమెంట్‌లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి
- విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల అమలులో లోపాలు సరిచేయాలి
- 'ఎవరి వాటా మాకు అక్కర్లేదు.. మా వాటా మాకు కావాలి'



హైదరాబాద్, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): చట్టసభల్లో బీసీలకు రాజ్యాంగబద్ధంగా 27 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యంపై మాట్లాడారు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కాలని, వారి చిరకాల డిమాండ్లను సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ సంస్థల్లో రిజర్వేషన్ల అమలులో పలుచోట్ల లోపాలు తలెత్తుతున్నాయని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయించుకోవడానికి బీసీలు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల భర్తీతో పాటు అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీ సమాజ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలితో పాటు పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాజ్యసభల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీసీ సమాజం ఏళ్ల తరబడి పోరాటం కొనసాగిస్తోందని, రాజకీయ నిర్ణయాల్లో తగిన భాగస్వామ్యం దక్కాలన్నది వారి ప్రధాన ఆకాంక్ష అని వివరించారు. 'ఎవరి వాటా మాకు అక్కర్లేదు.. మా వాటా మాకు కావాలి' అనే నినాదం బీసీ సమాజ సంకల్పాన్ని తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. తమకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటాను సాధించుకోవాలన్న లక్ష్యంతో బీసీలు ముందుకు సాగుతున్నారని తెలిపారు. జనాభాలో సగానికి పైగా ఉన్న వర్గాల ఆత్మగౌరవం, ఆకాంక్షలను ఈ రౌండ్ టేబుల్ సమావేశం ప్రతిబింబించిందని అన్నారు.

బీసీలకు 27 శాతం రాజకీయ రిజర్వేషన్ల డిమాండ్‌ను చట్టసభల్లో ప్రవేశపెట్టి, తప్పనిసరిగా అమలు చేయాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ, శాసనమండలి, పార్లమెంట్ ఉభయ సభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. బీసీల హక్కులు, వాటా, ఆత్మగౌరవానికి సంబంధించిన ఈ డిమాండ్‌ను సాధించే వరకు పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ భూ సర్వే

- ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే



హైదరాబాద్, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న సమగ్ర భూ రీసర్వేను రానున్న ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేసి, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చేపడుతున్న ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో ప్రతి జిల్లాకు 70 గ్రామాల చొప్పున, మ్యాప్‌లు అందుబాటులో లేని 373 గ్రామాల్లో రీసర్వే చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఈ పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వేను సమర్థంగా నిర్వహించేందుకు ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒక్కో సమావేశంలో నాలుగు నుంచి ఆరు గంటలపాటు చర్చించి భూముల విస్తీర్ణంలో తేడాలు, సరిహద్దు వివాదాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల అభ్యంతరాలను తెలుసుకున్నామని పేర్కొన్నారు. సర్వే సమయంలో భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు గుర్తించిన ప్రాంతాల్లో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యక్షంగా పాల్గొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినట్లు పొంగులేటి తెలిపారు. అవసరమైన చోట ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేందుకు మధ్యవర్తిత్వం చేయాలని సూచించామన్నారు. ప్రైవేటు భూ వివాదాల్లో ప్రభుత్వం ఏకపక్షంగా జోక్యం చేసుకోకుండా న్యాయబద్ధంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలను మాత్రం అధికారిక రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సర్వే చేపట్టే గ్రామాల్లో ముందుగానే చాటింపు ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తామని, సర్వే అనంతరం భూ యజమానులకు విస్తీర్ణ వివరాలు తెలియజేసి అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. న్యాయమైన అభ్యంతరాలుంటే తగిన సవరణలు చేస్తామని, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీసర్వే పూర్తయిన తర్వాత రైతులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన వాటర్‌ప్రూఫ్, మన్నికైన పాస్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని మంత్రి వెల్లడించారు. పాస్ పుస్తకంపై ఉండే ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సర్వే నంబరు, భూమి విస్తీర్ణం, భూమికి సంబంధించిన పటం తదితర వివరాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రతి భూ యజమాని భూముల వివరాలను మ్యాపింగ్‌తో అనుసంధానించి, ఒకే పాస్ పుస్తకంలో వివిధ సర్వే నంబర్లు, భూభాగాల వివరాలను ప్రత్యేక పేజీల్లో పొందుపరుస్తామని తెలిపారు. వ్యవసాయ భూములతో పాటు గ్రామాల్లోని నివాస స్థలాలు, ఇళ్లు, ఆబాదీ ఆస్తులకు కూడా సమగ్ర సర్వే నిర్వహిస్తామని, వాటికి మ్యాప్‌తో కూడిన గుర్తింపు పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయ భూములకు ఒక రంగులో, ఆబాదీ ఆస్తులకు మరో రంగులో వేర్వేరు పాస్ పుస్తకాలు జారీ చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఒక్కో మండలానికి ఒక సర్వే యూనిట్ ఉండగా, ప్రస్తుతం రెండు యూనిట్లకు పెంచామని తెలిపారు. భూ రీసర్వే కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని, తరతరాలుగా కొనసాగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నమని మంత్రి పేర్కొన్నారు. ప్రారంభ దశలో ఎదురైన సాంకేతిక, క్షేత్రస్థాయి ఇబ్బందులను అధిగమిస్తూ తదుపరి విడతల్లో మరింత వేగంగా సర్వే చేపడతామని చెప్పారు. ఇదే సమయంలో రాష్ట్రానికి ఇళ్ల కేటాయింపుల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి 13 లక్షల ఇళ్లు కావాలని కోరితే రెండు లక్షలు మాత్రమే మంజూరు చేశారని, గతంలో ఆంధ్రప్రదేశ్‌కు 17 లక్షల ఇళ్లు కేటాయించారని, తాజాగా కూడా తెలంగాణకు రెండు లక్షలు ఇవ్వగా ఏపీకి నాలుగు లక్షలు కేటాయించారని విమర్శించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటోందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వానికి కక్ష సాధింపు చర్యలు చేపట్టే ఉద్దేశం లేదని, ఏ నిర్ణయమైనా ఒక రోజు ఆలస్యమైనా శాస్త్రీయంగా, నిజాయితీగా తీసుకుంటామని పొంగులేటి స్పష్టం చేశారు. రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకారంతో భూ రీసర్వేను పారదర్శకంగా పూర్తి చేస్తామని తెలిపారు.

మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

హైదరాబాద్, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లోని మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సింధూజ అలియాస్ తుషారిక (36) మృతి చెందారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఆమె నివాసంలో విగతజీవిగా కనిపించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా భావిస్తున్నప్పటికీ, మృతికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సింధూజ పదేళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకున్నట్లు సమాచారం. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా నివసిస్తున్నట్లు తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆమె వ్యక్తిగత పరిస్థితులు, ఇటీవల ఎదుర్కొన్న సమస్యలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. గత నాలుగు నెలలుగా మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఆ ఒత్తిడికి గల కారణాలు ఏమిటి, ఆమె ఎదుర్కొన్న సమస్యలేమిటనే విషయాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. సూసైడ్ నోట్‌లోని వివరాలను పోలీసులు పరిశీలిస్తూ, ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నారు.నవంబర్ 26వ తేదీన సింధూజకు ఓ స్నేహితుడు ఫోన్ చేసినప్పటికీ ఆమె స్పందించలేదని తెలిసింది. పలు మార్లు ప్రయత్నించినా ఫోన్‌కు సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చినట్లు సమాచారం. అనంతరం ఘటన వెలుగులోకి వచ్చింది. ఆమె నివాసానికి చేరుకున్న వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ విషయం బయటపడింది. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని తదుపరి వైద్య పరీక్షల నిమిత్తం తరలించి, ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారు. సూసైడ్ నోట్‌లోని అంశాలు, స్నేహితులు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

విద్యుత్ రంగానికి కేంద్ర సహకారం కోరిన భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)


విద్యుత్ నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయడం తమ ప్రాధాన్యాలని వివరించారు.

పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్) కింద తెలంగాణకు సంబంధించిన రూ.25,096 కోట్ల ప్రతిపాదనలకు 60 రోజుల్లోగా ఆమోదం ఇవ్వాలని భట్టి విక్రమార్క కోరారు. ఈ పథకం అమలుకు గడువును 2028 మార్చి వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున సాధ్యాసాధ్యాల అంతర నిధులు అందించాలని, రాష్ట్రానికి చెందిన కల్లూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో 2,000 మెగావాట్ గంటల సామర్థ్యంతో బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థల ఏర్పాటుకు కేంద్ర సహకారం అందించాలని ప్రతిపాదించారు. విద్యుత్ ప్రసార వ్యవస్థల అభివృద్ధిలో భాగంగా రాయ్‌గఢ్-పుగలూర్-త్రిసూర్ అధిక వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ) కారిడార్‌కు జాతీయ హోదా కల్పించాలని కోరారు. ఈ కారిడార్‌కు సంబంధించిన 6,000 మెగావాట్ల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రత్యేకంగా సహకరించాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ మొదటి దశలో 23,480 ఎంవీఏ సామర్థ్యానికి సంబంధించిన పనులకు ఆమోదం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 400 కేవీ సెడమ్-పరిగి విద్యుత్ లైన్, మహేశ్వరం 2 సబ్‌స్టేషన్ నిర్మాణానికి జాతీయ స్థాయిలో వ్యయ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీలను హేతుబద్ధీకరించాలని, పునరుత్పాదక విద్యుత్ ప్రసార ఛార్జీల నుంచి 2030 మార్చి వరకు మినహాయింపు ఇవ్వాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. 2027 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన గ్యాస్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని, దానికి సంబంధించిన వ్యయాన్ని కేంద్రం, రాష్ట్రాలు భాగస్వామ్య పద్ధతిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ డిమాండ్ పెరిగే సమయంలో గ్యాస్ ఆధారిత కేంద్రాల ద్వారా ఉత్పత్తిని కొనసాగించేందుకు ఈ సహకారం అవసరమని వివరించారు.

రాష్ట్ర యాజమాన్యంలోని పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సహకరించే విషయంలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినందుకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ విద్యుత్ రంగ అభివృద్ధికి అవసరమైన కేంద్ర అనుమతులు, నిధులు, విధానపరమైన మద్దతు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించడం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడం, స్థిరమైన విద్యుత్ భవిష్యత్తును నిర్మించడం తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న జైల్‌భరో

- దేశవ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని సీపీఐ పిలుపు
- నల్లగొండలో జిల్లా కౌన్సిల్ సమావేశం
- ప్రజావ్యతిరేక విధానాలపై పల్లా వెంకటరెడ్డి విమర్శలు



నల్లగొండ, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 1న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసన కార్యక్రమాల ద్వారా బలంగా వినిపించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ ఆందోళనలో కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శుక్రవారం నల్లగొండలోని మగ్దూమ్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పల్లా వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై పార్టీ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల గురించి వివరించారు. దేశవ్యాప్తంగా ఒకే రోజున నిర్వహించనున్న జైల్‌భరో ద్వారా ప్రజల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యమంలో భాగంగా ముందుకు తీసుకురావాలని సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. పార్టీ శ్రేణులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుసుకుని డిసెంబర్ 1న జరిగే ఆందోళనలో భాగస్వాములు కావాలని కోరాలని నాయకులు సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు.ఇదే సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సాగర్ కుడి కాలువ నీటి తరలింపు అంశాన్ని ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, తెలంగాణకు సంబంధించిన నీటి హక్కులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 28 - నవంబర్ 2026
వరంగల్ 03

మాటలు వద్దు-జీవోలు కావాలి.. హామీలు వద్దు-అమలు కావాలి!

- రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 9లోగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..
- కేకే కమిటీ సిఫార్సులు వెంటనే అమలు చేయాలి.. లేకుంటే డిసెంబర్ 10న సీఎం నివాసం ముట్టడి..
- తాడూరి గగన్ కుమార్




కాప్రా, నవంబర్27(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ (కరీంనగర్) సూచన ప్రకారం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి. కృష్ణారావు (ఖమ్మం) పిలుపు మేరకు తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముందు అడుగు. సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబర్ 09/2026లోగా కేకే కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాలని కోరుచున్నాము కేవలం హామీలు, ప్రకటనలతో కాలయాపన చేయకుండా అర్హులైన ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం కల్పించే విషయం స్పష్టం చేయాలి. డిసెంబర్ 9లోగా డిమాండ్లు నెరవేరిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేస్తాం, లేనిపక్షంలో డిసెంబర్ 10న సీఎం నివాసాన్ని ముట్టడించి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన చేపడతామని హెచ్చరిస్తున్నాం. ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు మ పోరాటం కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం చేసి, లాఠీ దెబ్బలు తిని, కేసులు ఎదుర్కొని, జైళ్లకు వెళ్లి, ఉద్యోగాలు, కుటుంబాలు, వ్యక్తిగత జీవితాలను సైతం పక్కనపెట్టి ఉద్యమించిన తెలంగాణ ఉద్యమకారుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు ఇంకా గుర్తింపు కోసం రోడ్లపైకి రావాల్సిన దుస్థితి ఎందుకు వస్తుంది , తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు అధికారంలోకి రావడానికి ఉపయోగపడతాయి.. కానీ వారికి న్యాయం చేయడానికి మాత్రం ప్రభుత్వానికి సమయం లేదా. ఇక మాటలు వద్దు జీవోలు కావాలి! హామీలు వద్దుఅమలు కావాలి! అనే నినాదంతో జై తెలంగాణ.. జై జై అంటూ ఉద్యమకారులందరూ ఏకమవుతామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, రాష్ట్ర మీడియా కన్వీనర్, తాడూరి గగన్ కుమార్ డిమాండ్ చేశారు.

దళితుల ఆలయ ప్రవేశం వివాదంలో 45 రోజులైనా నిందితుల అరెస్టు ఏది?

- న్యాయం కోసం డీజీపీ, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు మాసాని సుధీర్

పెద్దమందడి,నవంబర్27(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో దళిత కుటుంబం ఆలయ ప్రవేశం చేసిన ఘటనకు సంబంధించి వివాదం కొనసాగుతోంది. ఆలయంలోకి ప్రవేశించినందుకు తమను కులం పేరుతో దూషించి, అవమానించడంతో పాటు ఆలయాన్ని కూలగొడతామని బెదిరించారని బాధితుడు మాసాని సుధీర్ ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదైనా 45 రోజులు గడుస్తున్నప్పటికీ నిందితులను అరెస్టు చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బాధితుడు మాసాని సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఆలయంలోకి వెళ్లిన సమయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మేనమామ వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజా వర్ధన్ రెడ్డి తదితరులు తమను అడ్డుకుని కులం పేరుతో అవమానించారని ఆరోపించారు. ఇన్ని సంవత్సరాలుగా దళితులను ఆలయంలోకి ప్రవేశించకుండా చేశామని, ఇప్పుడు ఆలయ ప్రవేశం చేసి అపవిత్రం చేశారని, ఆలయాన్ని కూలగొడతామని బెదిరించినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటి వరకు నిందితులపై అరెస్టు చర్యలు తీసుకోలేదని బాధితుడు తెలిపారు. 45 రోజులు గడిచినా తమకు న్యాయం జరగకపోవడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.అదేవిధంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులతో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఘటన జరిగినప్పటి నుంచి ఎమ్మెల్యే తమను పరామర్శించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో శుక్రవారం నవంబర్ 27న బాధితుడు మాసాని సుధీర్ హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీని, మానవ హక్కుల కమిషన్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి వినతులు సమర్పించారు. ఆలయ ప్రవేశం పేరుతో కుల వివక్షకు గురిచేసిన వారిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాసాని సుధీర్‌తో పాటు దళిత సంఘాల నాయకులు దొడ్ల రాములు, పెద్దింటి వెంకటేష్, గంధం పరంజ్యోతి, మంద రాము, పానుగంటి విజయ్, మోహన్, కొమ్ము చెన్నయ్య, పానుగంటి సురేష్, పెద్దగూడెం రాములు, మచ్చ తిరుపతయ్య, తప్పెట అశోక్, డి. నాగరాజు, పులిందర్, మహేందర్, గంధం నాగరాజు, సిరువాటి శంకర్, వి. అంజి, మాసాని సత్యన్న, కొమ్ము నరసింహ, మాసాని మహేష్‌తో పాటు గ్రామ దళితులు పాల్గొన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.







మురుగునీటితో బోర్లన్నీ కలుషితమే..!

- ఇళ్ల మధ్య మురుగునీటి కుంటలు.. బోర్లలోకి చేరుతున్న కలుషిత నీరు!
- కీసర ఎన్‌వీఆర్ కాలనీవాసుల అవస్థలు..
- ఔట్‌లెట్ మూసివేతతో తీవ్ర ఇబ్బందులు.. మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి..
- కీసర మండల అంబేద్కర్ సంఘం డిమాండ్..

కీసర, నవంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు): కీసర డివిజన్ పరిధిలోని కీసర ఎన్‌వీఆర్ కాలనీ (పాత శివాలయం)వద్ద మురుగునీటి సమస్య కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇళ్ల మధ్య మురుగునీరు పేరుకుపోయి కుంటలను తలపిస్తుండగా, మరోవైపు బోర్ల నుంచి సైతం ఎర్రటి రంగులో నీరు వస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు కాలనీ వాసుల పిలుపు మేరకు కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, బీఆర్ ఎస్ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్ సంఘటన స్థలంను పరిశీలించారు. సమస్యను కాలనీ బాధితులను అడిగి తెలుసుకోవడం జరిగింది. కీసర గ్రామానికి సంబంధించిన సుమారు 60 శాతం మురుగునీరు కాలువల ద్వారా ఈ ప్రాంతం వైపున ఉన్న ఔట్‌లెట్‌కు చేరుతుంది. అయితే నిన్న రాత్రి కురిసిన అకాల వర్షంతో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగి సమీపంలోని ఓపెన్ ప్లాట్లలోకి భారీగా నీరు చేరింది. అక్కడి నుంచి బయటకు వెళ్లాల్సిన ఔట్‌లెట్ మార్గం మూసి ఉండటంతో మురుగునీరు ముందుకు వెళ్ల లేక ఇళ్ల మధ్యనే నిలిచిపోతుందని గుర్తించడం జరిగింది.దీంతో కాలనీలో బోర్ల నుంచి ఎర్రటి రంగులో నీరు రావడంతో పాటు మురుగునీటి వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ నీటిని వినియోగిస్తే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.
ఈ కాలనీలో సుమారు 22 కుటుంబాలు నివసిస్తుండగా, చివరి ఇంటి వద్ద నివసిస్తున్న "సూర్య అనే బాధితుడు" తన కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.
కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం ఈ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కీసర మండల అంబేద్కర్ సంఘం డిమాండ్ చేస్తోంది.మూసుకుపోయిన ఔట్‌లెట్‌ను పరిశీలించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ డ్రైనేజీ మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతోంది. అలాగే బోరు నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించి, నీరు తాగడానికి సురక్షితమో కాదో నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తోంది.
"ఒకవైపు ఔట్‌లెట్ సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నీరు వెళ్లే మార్గం విషయంలో రైతులకు కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పరిష్కారం చూపాలని సంఘం కోరుతోంది."
ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకముందే అధికారులు స్పందించి రైతులకు, కాలనీవాసులకు న్యాయం చేయాలని కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్, కీసర బీఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్ డిమాండ్ చేస్తున్నారు.

డిసెంబర్ 1 నుంచి తీన్మార్ మల్లన్న రాజ్యాధికార యాత్ర పునఃప్రారంభం

- బహుజనులంతా పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేయాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ హుజురాబాద్ మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున పిలుపు

హుజురాబాద్,నవంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న డిసెంబర్ 1వ తేదీ నుంచి తిరిగి ప్రారంభించనున్న రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ హుజురాబాద్ మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున బహుజనులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని బహుజనులందరూ ఐక్యంగా కదిలి, యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు.



ఈ సందర్భంగా తిరగమల్ల నాగార్జున మాట్లాడుతూ.. బహుజనులకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచితమైన న్యాయం జరగాలంటే రాజ్యాధికారాన్ని సాధించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. బహుజనుల హక్కులు, ఆత్మగౌరవం, సమాన అవకాశాలు, అభివృద్ధి లక్ష్యంగా సాగుతున్న రాజ్యాధికార యాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలోని బహుజన వర్గాలకు తగిన రాజకీయ ప్రాధాన్యత, సామాజిక గౌరవం, ఆర్థిక అవకాశాలు లభించాలంటే ఐక్య పోరాటాలు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాధికార సాధన దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని బహుజనులు, యువత, విద్యార్థులు, మహిళలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో యాత్రలో భాగస్వాములై విజయవంతం చేయాలని నాగార్జున విజ్ఞప్తి చేశారు. బహుజనుల ఐక్యతే అసలైన బలమని, ఐక్యంగా ఉద్యమించినప్పుడే హక్కులను సాధించుకోవడంతో పాటు రాజ్యాధికార లక్ష్యాన్ని చేరుకోగలమని ఆయన అన్నారు.
డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న రాజ్యాధికార పాదయాత్రకు హుజురాబాద్ మండలం నుంచి కూడా బహుజనులు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలపాలని, యాత్ర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరగమల్ల నాగార్జున పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలందించడమే లక్ష్యం

- ఆర్థిక సేవలతో పాటు సామాజిక బాధ్యతకూ ప్రాధాన్యం
- విజ్ మనీ జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి

హుజురాబాద్,నవంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు): ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెరుగైన ఆర్థిక, విదేశీ మారకద్రవ్య, ప్రయాణ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని విజ్ మనీ జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హుజురాబాద్ పట్టణంలో విజ్ మనీ సంస్థ నూతన శాఖను ఆయన ప్రారంభించారు. శాఖ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను సంస్థ తరఫున బహూకరించారు.



ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, హుజురాబాద్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అవసరమైన ఆర్థిక సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నూతన శాఖను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో సంస్థకు ఇది 38వ శాఖ కాగా, దేశవ్యాప్తంగా 371వ శాఖగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను సులభతరంగా, పారదర్శకంగా, వేగంగా అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.
విదేశాలకు వెళ్లే ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు, విదేశాల్లో నివసించే తమ కుటుంబ సభ్యులకు నగదు పంపించే వారు తదితరులకు అవసరమైన సేవలను ఒకే చోట అందించేందుకు ఈ నూతన శాఖను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విదేశీ కరెన్సీ మార్పిడి, విదేశాలకు నగదు పంపించే సదుపాయం, విదేశీ ప్రయాణాల కోసం ప్రత్యేక నగదు కార్డులు, విమాన ప్రయాణ టికెట్ల బుకింగ్, విహారయాత్రల ప్రత్యేక ప్యాకేజీలు, తక్కువ వడ్డీ రేట్లతో బంగారు రుణాలు వంటి పలు సేవలను ఈ శాఖ ద్వారా అందించనున్నట్లు తెలిపారు.

నీటి పొదుపు, విద్యుత్ ఆదాపై అధికారుల నిర్లక్ష్యం

- ప్రభుత్వ హెచ్చరికలు బేఖాతర్
- అధికార యంత్రాంగంపై ప్రజల ఆగ్రహం

పెద్దమందడి,నవంబర్27(తెలంగాణ ముచ్చట్లు): ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి, విద్యుత్ కొరత వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్తును ఆదా చేయాలని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సూచనలు చేస్తోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు, ఐమాక్స్ లైట్లు పట్టపగలే వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు ప్రభుత్వం విద్యుత్ పొదుపు చేయాలని, మరోవైపు నీటి వృథాను అరికట్టాలని ప్రజలకు సూచిస్తుండగా, సంబంధిత అధికారులు మాత్రం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పగటిపూట వీధి దీపాలు, ఐమాక్స్ లైట్లు ఆపాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకపోవడంతో విలువైన విద్యుత్తు వృథా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.పెద్దమందడి మండల కేంద్రంలోనే కాకుండా వివిధ గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు, హెచ్చరికలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడటంతో ప్రభుత్వ వనరులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నీరు, విద్యుత్తు ప్రజలకు ఎంతో అవసరమైన వనరులని, వాటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో అధికారులే నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి ఎలా మారుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు నీటి పొదుపు, విద్యుత్ ఆదాపై సూచనలు చేసే అధికారులు ముందుగా తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో పర్యవేక్షణ చేపట్టి, పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు, ఐమాక్స్ లైట్లను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు విద్యుత్ పొదుపుపై ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరుతున్నారు.





తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- **పామిరెడ్డిపల్లి సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం**

పెద్దమందడి,నవంబర్27(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం1లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తొలిముద్ద' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించి, వారితో కలిసి సర్పంచ్ బ్రేక్ఫాస్ట్ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉదయం వేళ సకాలంలో అల్పాహారం అందించడం ద్వారా వారిలో పోషకాహార లోపాన్ని నివారించవచ్చని అన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.రాష్ట్రంలో ఎంతోమంది చిన్నారులు పౌష్టికాహార లోపంతో అనారోగ్యానికి గురవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తొలిముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాల చిన్నారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన అల్పాహార సరుకులు పక్కదారి పట్టకుండా,ప్రతిరోజూ చిన్నారులకు సకాలంలో తొలిముద్ద కార్యక్రమాన్ని నిర్వహించాలని అంగన్వాడీ కార్యకర్తకు సూచించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించే విషయంలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా తొలిముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డికి సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములమ్మ హనుమంతు, వార్డు సభ్యులు కావలి కృష్ణ, కొంకలి నరేష్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్, అంగన్వాడీ కార్యకర్త సునీత, ఆయా యాదమ్మ, గ్రామ నాయకులు పానుగంటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ

- **ఒక్కొక్కరికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించేందుకు శ్రీకారం**

పెద్దమందడి,నవంబర్27(తెలంగాణ ముచ్చట్లు): మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2026 నవంబర్ 27న నిర్వహించిన ఈ కార్యక్రమంలో 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులకు మొదటి విడతలో భాగంగా 24 మందిని ఎంపిక చేసి స్వయం ఉపాధి రంగంలో శిక్షణ అందించారు.ఈ సందర్భంగా దివ్యాంగులకు వ్యాపార నిర్వహణ, స్వయం ఉపాధి అవకాశాలు, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే విధానాలు, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో భాగంగా శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ సహాయంతో దివ్యాంగులు సొంతంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించడం, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు తోడ్పాటు అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యక్రమాల నిర్వాహకులు ఆనంద్ నాయక్,సమన్వయకర్త బాలకృష్ణ,ఏపీఎం సక్రునాయక్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి. భార్గవి, కార్యదర్శి ఎస్. నాగమ్మ, కోశాధికారి పద్మమ్మ, ఎన్హెచ్సీ సీసీ నాగరాజు, రాణి, హరిత, దేవి సీసీలు, ఈఐ సీబీఆర్ కార్యకర్త లక్ష్మి, లెక్కల నిర్వాహకురాలు రాధా, నిర్వహణ సహాయకురాలు ఎం.ఎస్. రాధ, ఆయా చంద్రకళతో పాటు పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

మల్లికుదుర్లలో తాగునీటి బావిని శుభ్రం చేయించిన సర్పంచ్

వేలేరు, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ ప్రజల అవసరాల నిమిత్తం వినియోగిస్తున్న మంచి నీటి బావిని గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక-సంపత్ యాదవ్ ప్రత్యేకంగా శుభ్రం చేయించారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా, ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. నీటి వనరుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ బావిని శుభ్రం చేయించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంతర్జాతీయ వేదికపై కరీంనగర్ అభివృద్ధి నమూనా ప్రస్తావన

- **30 దేశాల మేయర్లు, పట్టణాభివృద్ధి మంత్రులతో కీలక చర్చలు**
- **వరల్డ్ మేయర్స్ ఫోరంలో కరీంనగర్ అభివృద్ధి విజన్‌పై మేయర్ కోలగాని శ్రీనివాస్ ప్రసంగం**

కరీంనగర్, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): ముంబై వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మూడవ వరల్డ్ మేయర్స్ ఫోరం అంతర్జాతీయ సదస్సులో కరీంనగర్ నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన మేయర్లు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, స్థానిక ప్రభుత్వ ప్రతినిధులతో ఆయన భేటీ అయి నగరాల భవిష్యత్ అభివృద్ధిపై జరిగిన చర్చల్లో భాగస్వాములయ్యారు.



ముంబైలోని ఫెయిర్‌మాంట్ హోటల్ వేదికగా రెండు రోజులపాటు ఈ సదస్సు నిర్వహించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 దేశాలకు చెందిన నగరాల మేయర్లు, వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు.
సదస్సు మొదటి రోజు 'భారతదేశం 2047 కోసం ప్రణాళిక - 2047 నాటికి నగరాల పునర్నిర్మాణం', కృత్రిమ మేధ ఆధారిత భవిష్యత్ నగరాల నిర్వహణ, పట్టణ వ్యర్థాల సమస్య పరిష్కారం, పునర్వినియోగ ఆధారిత నగరాల నిర్మాణం, ప్రపంచ పెట్టుబడుల ద్వారా స్థానిక అభివృద్ధి వంటి అంశాలపై సాంకేతిక సమావేశాలు నిర్వహించారు.
రెండవ రోజు నగరాలను మరింత సురక్షితంగా తీర్చిదిద్దడం, నదీ నగరాల అభివృద్ధి, ప్రజా రవాణాకు ప్రాధాన్యతనిచ్చే పట్టణ రవాణా వ్యవస్థ, పర్యావరణానికి హాని కలిగించని మౌలిక సదుపాయాలు, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోవడం, మహానగర పాలన బలోపేతం, క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన నగరాల నిర్మాణం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగాయి. అనంతరం ముగింపు సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికపై కరీంనగర్ నగర అభివృద్ధి దార్శనికతను, నగర సమగ్రాభివృద్ధిపై తమ పాలకవర్గానికి, నగరపాలక సంస్థకు ఉన్న సంకల్పాన్ని వివరించినట్లు తెలిపారు. వివిధ దేశాల్లోని నగరాల్లో అమలవుతున్న అత్యుత్తమ అభివృద్ధి విధానాలు, ఆధునిక పాలనా పద్ధతులను అధ్యయనం చేసేందుకు ఈ సదస్సు ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించాలి





- **వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీపీ కార్యాలయం తనిఖీ చేసిన భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్. శ్వేత**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు): ప్రజలకు మరింత మెరుగైన ట్రాఫిక్ సేవలు అందిస్తూ, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్.శ్వేత అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీఐజీ గారికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ కమిషనర్ తో కలసి మొక్కలు నాటారు. ముందుగా పోలీస్ సిబ్బంది కిట్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల పనితీరు, స్టేషన్ నిర్వహణ, రికార్డులను పరిశీంచారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతూ...ట్రాఫిక్ విధుల నిర్వహణ అత్యంత కీలకమైన బాధ్యత అని, ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా సాగడంలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నిత్యం సామాన్య ప్రజల మధ్య ఉంటూ విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది సహనం, సంయమనం, ఓర్పుతో వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజా రవాణాకు అంతరాయం కలగడంతో పాటు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూనే నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. కాలుష్యం, దుమ్ము, వాహనాల పొగ మధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ...అవసరమైన రక్షణ పరికరాలు వినియోగించుకోవడంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం సీపీవో (పోలీస్ కమిషనర్ కార్యాలయం) పరిపాలన విభాగం, షీటీమ్, సీసీఆర్బీ, నార్కోటిక్, భరోసా సెంటర్ ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ శివప్రసాద్, అప్పలనాయుడు, రేంజ్ ఆఫీస్ సూపరిండెంట్ యాకుబ్ బాబా పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు, మౌళిక సదుపాయాల పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

- **త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాలనీ ప్రారంభోత్సవం**

ఖమ్మం బ్యూరో , నవంబర్ - 27(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 15 వ డివిజన్ వెలుగుమట్ల లో వేగంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పాటు మౌళిక సదుపాయాల కల్పన పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భూదాన్ భూమిలో నిరుపేదలకు 310 ఇండ్ల నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. గతంలో వెలుగుమట్ల ప్రాంతంలో కూలీ నాలీ చేసుకుంటూ జీవించే వేలాది మంది పేద ప్రజలను కొందరు వ్యక్తులు, సంఘాల పేరుతో మోసగించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. డూప్లికేట్ పట్టాలు ఇచ్చి, పేదల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు దౌర్జన్యం, బలప్రయోగంతో ఇబ్బందులకు గురిచేసిన అంశం ప్రభుత్వ దృష్టికి వచ్చిందని తెలిపారు. డూప్లికేట్ పట్టాలు ఇచ్చిన సంఘాలు కోర్టుకు వెళ్లినప్పుడు, హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ భూదాన్ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, నిజమైన నిరుపేదలకు సౌకర్యాలు కల్పించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చిందని మంత్రి అన్నారు. ఆ కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని, ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు అప్పట్లో అక్కడ నివసిస్తున్న నిజమైన నిరుపేదల పేరిట భూదాన్ భూమిలో 310 ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చాలావరకు పూర్తయ్యాయని, మిగిలిన సుమారు 10 శాతం పనులు మరో వారం నుంచి పది రోజుల్లో పూర్తవుతాయని మంత్రి తెలిపారు. కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా బస్తీ దవాఖాన, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, పార్క్, డ్రెయిన్స్, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఇండ్లు, సదుపాయాలను ప్రారంభించాలని భావిస్తున్నామని మంత్రి అన్నారు. ప్రస్తుతం భారత్ సమ్మిట్ చివరి రోజు కార్యక్రమం ఉన్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి తో సంప్రదించి వారు ఇచ్చే తేదీకి అనుగుణంగా పనులన్నీ పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్, హౌసింగ్, మున్సిపల్ కార్పొరేషన్, వివిధ శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన కృషి చేస్తున్నారని అన్నారు. అతి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాలనీని ప్రారంభించి నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి కె. శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయ చంద్ర, నగరపాలక సంస్థ డిఇ నవ్యజ్యోతి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం బ్యూరో , నవంబర్ - 27(తెలంగాణ ముచ్చట్లు): ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026 నిర్వహణకు సంబంధించి ఖమ్మం స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి, మౌళిక సదుపాయాల పనులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ, ఆధునీకరణ పనుల పురోగతిని మంత్రి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.



జాతీయ స్థాయి క్రీడలకు హాజరయ్యే క్రీడాకారులకు, అలాగే క్రీడలను వీక్షించేందుకు వచ్చే క్రీడాభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ నాటికి స్టేడియం సర్వాంగ సుందరంగా, పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి టి. సునీల్ రెడ్డి, ఖమ్మం నగర పాలక సంస్థ డిఇ ధరణి కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 28 - నవంబర్ 2026
వరంగల్ 05

కార్మిక హక్కుల సాధనకు చలో ఢిల్లీ



- **డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో పార్లమెంట్ ముట్టడి..**
- **గోడపత్రిక ఆవిష్కరణ**

జమ్మికుంట, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): కార్మికుల హక్కుల పరిరక్షణ, కార్మిక వ్యతిరేక విధానాల రద్దు ప్రధాన డిమాండ్లుగా డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జమ్మికుంటలో సీఐటీయూ నాయకులు గోడపత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో లక్షలాది మంది కార్మికులతో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడాన్ని కార్మిక హక్కులకు విఘాతంగా పేర్కొన్నారు. రైతు చట్టాల రద్దు, గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం వంటి నిర్ణయాలు కార్మికులు, రైతులపై ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు.కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, పని గంటలను పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలోనూ పని గంటలను 10 గంటలకు పెంచే చర్యలు కార్మికుల పై అదనపు భారాన్ని మోపుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు నెలకు రూ.42 వేల కనీస వేతనం, రూ.21 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని స్పష్టం చేశారు.

అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్లో ఉన్న కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలో నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన జరిగే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా, మండల కన్వీనర్ జక్కుల రమేష్ యాదవ్, సిరికొండ పోచయ్య, మధునయ్య, మారెపల్లి కిరణ్, కోడారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆకలి తీర్చేందుకు జీవితకాల భరోసా



- **సాయి కేంద్రానికి సబ్బని వెంకట్ అండ!**
- **ప్రతి నెలా 50 కిలోల బియ్యం అందిస్తానని హామీ**

జమ్మికుంట, నవంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు): సేవాభావానికి జీవితకాలపు భరోసా తోడైంది. అభాగ్య చిన్నారుల ఆకలి తీర్చేందుకు సబ్బని వెంకట్ ముందుకొచ్చారు. జమ్మికుంటలోని సాయి మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, వారికి అందుతున్న వైద్య సేవలు, భోజన, పోషకాహార సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.కేంద్రంలోని చిన్నారుల పరిస్థితులను తెలుసుకున్న సబ్బని వెంకట్, వారి భోజన అవసరాలకు తనవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. తాను జీవించి ఉన్నంతకాలం ప్రతి నెలా 50 కిలోల బియ్యం అందిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారులకు ఆహారం విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానసిక వికలాంగులైన చిన్నారులకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే తనకు నిజమైన సంతృప్తి అని అన్నారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని పేర్కొన్నారు.ప్రచారం కోసం కాకుండా మానవత్వంతో చేసే సేవకు నిలువెత్తు నిదర్శనంగా సబ్బని వెంకట్ అందించిన జీవితకాలపు హామీ నిలుస్తోంది.

ఘనంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ జన్మదిన వేడుకలు



